

కె. శ్రీనివాసరావు

కథ

# ఖబడ్దార్ మాష్టారి శిష్యుణ్ణి నేను...

జగన్నాథంగారు రిటైర్ అయి చాలా కాలం అయ్యింది. ఆ ఊరి చుట్టుప్రక్కల గ్రామాలలో ముప్పై ఏళ్ళ పైబడ్డ సర్వీసు ఉన్న టీచర్ ఆయన. పాఠాలు చెప్పడమే కాకుండా, పల్లెలలోని ప్రజలకు ఉత్తరాలు వ్రాసి పెట్టేవారు. కోర్టు కాగితాలు చదివి బోధపడేదాకా వివరిస్తారు. ఆయన చుట్టుప్రక్క గ్రామాలలో ఎంతోమందికి ఎన్నో విధాలుగా సహాయం చేస్తూ తన జీవితం సాఫీగా సాగించారు. రిటైరైనా కూడా ఊర్లో, ఊరి చుట్టుప్రక్కల గ్రామాల్లో ప్రజలకు ఏదో విధంగా ఉపయోగపడుతూ ఉద్యోగం చేస్తున్నంత బిజీగా ఉంటారు. రోజూ ఉదయం లేచిన దగ్గర నుండి ఇంగ్లీషు పాఠాలు, ప్రభుత్వ కార్యాలయానికి దరఖాస్తులు, పుర పాలక సంఘం వారికి అర్జీలు, రిటైర్ అయినవాళ్ళ పింఛన్ విషయాలు, బేంక్ విషయాలు- ఇలా ఎన్నో రకాల పనులతో ఆయన అందరి మనిషిగా అన్ని పనులు తనవే అన్నట్లు చేస్తారు. చదువుకోడానికి పిల్లలకి ప్రభుత్వ ఇచ్చే స్కాలర్‌షిప్‌లు తెప్పించడం, అర్హత అగ్రకులాల బీద పిల్లలకు తనకు వీలైన డబ్బులు ఇచ్చి, నలుగురిచేత ఇప్పించి వారి చదువు పూర్తి అయ్యేలా చూస్తారు. చదువు పూర్తి అయిన వాళ్ళకి ఉద్యోగాలకి దరఖాస్తులు ఎలా పెట్టాలో, ఇంటర్వ్యూలకి ఎలా తయారవ్వాలో కూడా చెబుతారు. అవసరం అయితే అర్హతలున్నవారికి తనకు తెలిసినవాళ్ళ ద్వారా ఉద్యోగాలు వేయిస్తారు. ఊర్లో ఎక్కడికి వెళ్ళాలన్నా నడిచే వెళ్ళేవారు. అందువల్ల ఆయనతో చాలా మందికి పరిచయం ఉంది.

ఆయన ఇంటి వీధి చివరన ఉన్న ఐదు రోడ్ల జంక్షన్లో క్రిష్ణ ఉంటాడు. అతడికి ఒక కిళ్ళీకొట్టు ఉంది. సాయంత్రం సాధారణంగా అక్కడ నిలబడి కబుర్లు చెప్పుకుంటారు చాలామంది. ఒకరోజు జగన్నాథంగారు అక్కడ నిలబడి కబుర్లాడుతూ సోడా తాగుతున్నారు. ఈయన్ని చూసి ఆ జంక్షన్‌లోంచి వెళుతున్న ఆ ఊరి ఎమ్:ఎల్.ఏ. కారు, దాని వెనుక వస్తున్న మరో రెండు కార్లు హఠాత్తుగా జంక్షన్లో ఆగాయి. కారులోంచి ఎమ్.ఎల్.ఏ. ఆయన అనుచరులు దిగారు.

"ఒరేయ్ జగన్నాథం మేష్టు..." అని ఎమ్.ఎల్.ఏ. అరిచాడో, పిలిచాడో తెలియని గొంతుకతో గట్టిగా అన్నాడు. ట్రాఫిక్ ఆగిపోయింది. మనుషులు కదలకుండా నిలబడిపోయారు. జగన్నాథంగారికి అటు ఇటు ఉన్న వ్యక్తులు ఆయనకు దూరంగా జరిగారు. జగన్నాథంగారు ఎక్కడ ఉన్నారో అక్కడ కదలకుండా నిలబడ్డారు. ఎమ్.ఎల్.ఏ. అతని వైపే పెద్ద పెద్ద అంగలతో నడిచి వెళ్ళాడు. గుంపు ఉత్కంఠతో ఏం జరుగుతుందా అని చూస్తున్నారు.

"ముసిలోళ్ళ పింఛన్లని, ఇళ్ళ స్థలాలని నా అపొజిషన్‌లో ఉన్న మాల, మాదిగల చేత అప్లికేషన్లు పెట్టిస్తావ్రా? నన్నెదిరించాలనుకొంటున్నారా? ఆనా కొడుకులు వంగి దండం పెట్టేదాకా ఆళ్ళకి ప్రభుత్వం నుండి చీపురు పుల్ల కూడా అందదు. కలక్టర్‌కే అర్జీలు పెట్టిస్తావురా. నువ్వు పెట్టించిన దరఖాస్తులన్నీ ఆ కలక్టర్‌గాడి చేత్తోనే చింపించాను. ఏం చేసుకొంటావో చేసుకో. జాగ్రత్త?" అని అందరి వైపు తిరిగి "నాతో పెట్టుకోవద్దు" ఓ వార్నింగ్ ఇచ్చాడు.

"ఎమ్.ఎల్.ఏ.గారూ! మీ నియోజక వర్గంలో ఉన్న చాలా గ్రామాలలో పని చేసాను. ఆ గ్రామాలలో ఉన్న వాళ్ళు ఏ కులం వాళ్ళయిన నాకు కావలసిన మనుషులే వారిని కులాలతో చూడలేదు. గవర్నమెంటు పథకాలకి అర్హులైనవారితో అర్జీలు పెట్టిస్తున్నాను. వాళ్ళకి రావలసిన పింఛన్లు, లోనులు, ఇళ్ళస్థలాలు..." జగన్నాథం మాటలని లెక్క పెట్టకుండా.

"నా మనుషులైతేనే అవి వస్తాయి. నాకు ఓటేస్తేనే వస్తాయి. తెలుసుకో నా నియోజక వర్గంలో ఉన్నవాళ్ళంతా నా ప్రజలు ఎవరికి ఏం చెయ్యాలో, ఎప్పుడు చెయ్యాలో ఎలా చెయ్యాలో నేను, నా మనుషులు చూసుకొంటాం. నువ్వు నోరు మూసుకొని ఉండు" అన్నాడు ఎమ్.ఎల్.ఏ. ఆవేశంతో ఊగిపోతూ.

"నేను దరఖాస్తు పెట్టించినవాళ్ళంతా ఏడాదిగా ఎదురుచూస్తున్నవాళ్ళే. వాళ్ళకి... ఏదో చెప్పబోతుండగానే" మళ్ళీ అతని మాటలకి అడ్డు వస్తూ "నువ్వు ఏ మాల మాదిగ నా కొడుకులకి సాయం చెయ్యాలనుకుంటున్నావో వాళ్ళ చేతనే నీ మీద ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం క్రింద కేసు పెట్టిస్తాను జాగ్రత్త" అని మరింత ఆవేశంతో గట్టిగా అరిచాడు. అందరూ చూస్తూ నిలబడ్డారు. ఒక్కరు కాలు కదపలేదు. నోరు మెదపలేదు. వాతావరణం అంతా స్థంభించిపోయినట్లుంది. ఎమ్.ఎల్.ఏ. ఆవేశంగా ఊగిపోతున్నాడు.

"ప్రజల్నీ, చట్టాల్నీ పావుల్లా వాడుకోవడం కాదు. ప్రజలకు సేవ చేయాలి. అదీ రాజకీయ నాయకుని ధర్మం!" అని జగన్నాథం మాష్టారు నిర్భయంగా, గట్టిగా, రాజకీయాల్లో ఉన్న అందర్ని ఉద్దేశించి అన్నారు.

"ఇళ్ళిప్పిస్తానని మామూలు ప్రజల దగ్గర డబ్బులు కాజేసేవాళ్ళు ఖబడ్దార్. వాళ్ళకి అన్యాయం జరిగితే మాత్రం సహించను" అన్నారు మేష్టారు.

"ఏమన్నావురా నా కొడకా..." అంటూ ఆవేశంతో ఊగిపోయాడు ఎమ్.ఎల్.ఏ. జగన్నాధం. మాష్టారివైపు వస్తున్న అతని వెనక అతని అనుచరులూ కదిలారు. పెద్ద కలకలం రేగింది. ఇంతలో ఆవేశం ఎక్కువై కాబోలు భారీ కాయం ఉన్న ఎమ్.ఎల్.ఏ. ఒక్కసారి తూలిపోయాడు. అతని అనుచరులు వచ్చి పట్టుకున్నారు. చెమటతో ఒళ్ళు తడిసిపోయింది. డీలాపడి వెనక్కి వాలిపోయాడు. కిల్లీకొట్టు క్రిష్ణ వాటర్ బాటిల్ ఒకటి తీసుకొని పరుగున వచ్చి ఎమ్ఎల్ఏ మొహం మీద నీళ్ళు చిలకరించాడు. ఆ జనంలోంచి జగన్నాధాన్ని బయటకు తీసుకువెళ్ళిపోయారు. కిల్లీకొట్టు క్రిష్ణ ఒక గోలీ సోడా కొట్టి ఎమ్.ఎల్.ఏ.గారిచేత మెల్లిగా తాగించాడు. కోలుకున్న ఎమ్.ఎల్.ఏ.ని ఆయన మనుషులు కారెక్కించి తీసుకెళ్ళిపోయారు.


ఇదంతా చూస్తున్న జనం బొమ్మల్లా నిలబడిపోయారు. అప్పటికే అక్కడికి చేరిన కాలేజి కుర్రాళ్ళు స్కూలు పిల్లలు, పెద్దలు ఎమ్.ఎల్.ఏని నడిరోడ్డు మీద 'ఖబడ్దార్' అనగలిగిన మొగాణ్ణి చూసినందుకు చాలా గర్వించారు, ఆనందించారు. ఆ క్షణం ఆ వార్త దావానలంలా వ్యాపించింది. ఊర్లో అందరూ ఆయిన్ని 'ఖబడ్దార్ మాష్టారు' అని పిలుస్తుంటారు. పబ్లిక్‌గా మేష్టారితో గొడవ పెట్టుకున్నందుకు ఎమ్.ఎల్.ఏ.ని వాళ్ళ నాన్న తిట్టాడు. మేష్టారి లాంటి వాళ్ళను ఎలా డీల్ చేయాలో చెప్పాడు తన వ్యాపారవేత్త అయిన తన అన్న. అందరి దృష్టి ఆనాటి సంఘటన మీద ఉండిపోయింది. అపోజిషన్‌వాళ్ళు దీన్ని పెద్దది చేయాలని చూశారు. మేష్టారు అందుకు అంగీకరించలేదు. మేష్టార్ని అలా తిట్టడం మంచిది కాదని, అందువల్ల ఆ మేష్టార్ని మరేం అనడం కాని, చెయ్యడం కాని మంచిది కాదని అనుకున్నాడు.

** ** **

---

*కిల్లీ కొట్టును మించి ఇంకా ఎదగాలన్న ఆశ ఉంది. ఏదో చేయాలన్న తపన క్రిష్ణని ఊర్కోనివ్వడం లేదు. రాజకీయాల్లోకి ఎలా చేరాలో సరిగ్గా తెలియరాలేదు. సరిగ్గా అటువంటి సమయంలో ఇటువంటి అవకాశం రావడం...*

---



కొంతకాలం తరువాత ప్రజలు ఈ విషయం మరిచిపోయారు. కిల్లీ కొట్టు క్రిష్ణకి కొంత పలుకుబడి ఉంది. పైగా సమయానికి సోడా అందించాడన్న కృతజ్ఞతతో ఎమ్.ఎల్.ఏ. మనుషులు క్రిష్ణని చేరదీసారు. కిల్లీ కొట్టు క్రిష్ణకి ఈ సంఘటనతో ఎమ్.ఎల్.ఏతో పరిచయం అయింది.

లోలోన కిల్లీ కొట్టును మించి ఇంకా ఎదగాలన్న ఆశ ఉంది. ఏదో చేయాలన్న తపన క్రిష్ణని ఊర్కోనివ్వడం లేదు. రాజకీయాల్లోకి ఎలా చేరాలో సరిగ్గా తెలియరాలేదు. సరిగ్గా అటువంటి సమయంలో ఇటువంటి అవకాశం రావడం ఊహించలేకపోయాడు. రాత్రి పగలు రాజకీయాల గురించి ఆలోచించడం, పేపరులో రాజకీయాలు చదవడం, ఎమ్.ఎల్.ఏ.తోనో అతని అనుచరులతోనో ప్రజా సమస్యలను చర్చించడం మొదలుపెట్టాడు. దాంతో వచ్చిన కొత్త పలుకుబడి వల్ల కిల్లీకొట్టు వ్యాపారం కూడా పెరిగింది.

మూడేళ్ళలో ఎమ్.ఎల్.ఏకి కొంత దగ్గరయ్యాడు. పార్టీలో చేరాలని చాలా మంది మిత్రులు ప్రోత్సహించారు. ఇంతలోనే ముందస్తుగా ఎలక్షన్లు వస్తున్నాయి అన్న వార్త అతనికి కొంత ఆనందం కలిగించింది. ఎలక్షన్ల ముందు ఎంతో మందిని పార్టీలో చేర్చే కార్యక్రమం ఉంటుంది. దాన్ని లాంఛనంగా కిల్లీకొట్టు క్రిష్ణతో మొదలుపెట్టాలని ఎమ్.ఎల్.ఏ. నిర్ణయించుకున్నాడు. ఓ వంద మందిని పార్టీలో చేర్పించమని కబురు పెట్టాడు. వచ్చే నెల పెద్ద ఫంక్షన్ పెట్టి మంత్రుల్ని రప్పించి క్రిష్ణని, క్రిష్ణ చేర్పించబోయే వారిచేత ప్రమాణం చేయించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ చేరబోయేవాళ్లు ఒక్కొక్కళ్ళు ఒక వంద మందిని వచ్చే నెల రోజుల్లో చేర్పించేందుకు తగిన పథకం వేశారు. ఆ విధంగా పార్టీలోకి రాబోతున్న వెయ్యిమందికి తాను లీడర్ అవుతానన్నది క్రిష్ణకి అనిపించింది. ఎమ్ఎల్.ఏ. కొడుకు చిన్నవాడు. తమ్ముడు వేరే పార్టీలో ఉన్నాడు. అన్న వ్యాపారంలో ఉన్నారు. ఇంక సరియైన వారసుడు క్రిష్ణే అని అతని మిత్రులు నూరిపోశారు. ఇలా కాకుండా క్రిష్ణకి తాను ఇంకా ఏవో మంచి పనులు చేయాలని అనిపిస్తూ ఉండేది.

రాబోతున్న ఎన్నికల హడావిడితో ఎమ్.ఎల్.ఏ. భవంతి కోలాహలంగా ఉంది. ఆ వీధి చివరలో ఉన్న క్రిష్ణ కిల్లీకొట్టు మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. క్రిష్ణ చదువుకునే తన తమ్ముడిని కిల్లీకొట్లో కూర్చోబెట్టాడు. ఇవాళో రేపో ఎమ్.ఎల్.ఏ.కి మళ్ళీ టికెట్టు రాగానే ఊరూరా ప్రచారం మొదలవ్వాలి. సరిగ్గా అటువంటి సమయంలో హైదరాబాదు నుండి పిడుగులాంటి వార్త వచ్చింది. ఎమ్.ఎల్.ఏకి ఈ ఎలక్షన్‌లో ఈ నియోజకవర్గం నుండి టిక్కెట్టు ఇవ్వడం లేదని. అది విన్న ఎమ్.ఎల్.ఏ. ఆవేశపడి పార్టీలో ఉన్న పెద్దలు అందరికి ఫోన్ చేశాడు. తన కోపాన్ని ప్రదర్శించాడు. టిక్కెట్టు ఎవడికి ఇచ్చారో తెలిస్తే వాడి అంతు చూస్తానన్నాడు. హైబీపీ ఉన్నా సరే ఎమ్.ఎల్.ఏ. విశ్రాంతి తీసుకోలేదు. డాక్టర్ల మాట పెడచెవిన పెట్టి, రెండు రోజుల పాటు రాత్రి పగలు టిక్కెట్టు కోసం చేయరాని ప్రయత్నాలు చేసాడు. ఆ టిక్కెట్టు ఇచ్చింది తన్ని రాజకీయాల్లోకి పంపి, వెనకదన్నుగా ఉన్న వ్యాపారవేత్త తన అన్నకే అని తెలిసి తట్టుకోలేకపోయాడు. తన అండతోనే దొంగ వ్యాపారం చేస్తూ బాగా డబ్బులు సంపాదించిన తన అన్నే తనకి తెలీకుండానే మాయోపాయాలతో టిక్కెట్టు కొట్టేశాడు. ఈసారి పార్టీకోసం విశ్వాసంగా పని చేస్తే వచ్చే ఎన్నికలకి సీటు ఇస్తామని వాగ్దానంచేసింది పార్టీ. ఇంత మోసం తట్టుకోలేకపోయాడు. ఏమాత్రం ఊహించలేకపోయాడు. ఐనా చివరి ప్రయత్నంగా హైదరాబాదు పోయాడు. అక్కడే చివరి శ్వాస విడిచాడు. ఎమ్.ఎల్.ఏ. మరణవార్త విన్న క్రిష్ణకి కాళ్ళు చేతులు ఆడలేదు. రాజకీయమంటే ఇంత క్రూరంగా ఉంటుందా అని విస్తుపోయాడు. తన భవిష్యత్ ఏమిటో అన్న ఆలోచనల నల్లమేఘం కమ్మింది. తను, తను తీసుకొచ్చిన వందమంది, వాళ్ళు తీసుకొని రాబోయే వెయ్యిమంది క్రిష్ణ శ్రేయోభిలాషులు అతనికి ధైర్యం చెప్పారు. లేచి చెయ్యవలసిన పనులు చెయ్యమన్నారు. ఎమ్.ఎల్.ఏ.అభ్యర్థికి కోపం వస్తుందేమో అని. ఎమ్.ఎల్.ఏ. అంత్యక్రియల్లో చాలామంది ముఖం చాటేశారు. అందుకే క్రిష్ణని ముఖ్యమైన పాత్ర తీసుకోమన్నారు స్నేహితులు. పోయిన ఎమ్.ఎల్.ఏ.కి క్రిష్ణ వారసుడన్నారు. ఎమ్.ఎల్.ఏ. అంత్యక్రియలని కుటుంబంలోని ఒక వ్యక్తిలా చేయడం మొదలుపెట్టాడు. కేవలం మానవతా దృక్పథంలోనే వేలలో జనం వస్తారని దానికి తగిన ఏర్పాట్లు చెయ్యసాగాడు. తన కిల్లీకొట్టుకు వచ్చే జనానికి సరిపోయే నీళ్ళ పేకట్లు, సోడాలు ఉచితంగా ఇవ్వవలసి వస్తుందని ముందుగా డబ్బు పెట్టి సరుకు తెచ్చి ఉంచాడు. అంత్యక్రియల రోజు ఉదయం పాడె సిద్ధం చేసారు. ప్రజలు వచ్చిన తరువాత ఒక ఊరేగింపుగా స్మశానానికి తీసుకెళ్ళాలని నిశ్చయించారు.

ఉదయం తొమ్మిది గంటలైంది. ఎమ్.ఎల్.ఏ. ఇంటి ముందు పదీ పదిహేను మందికంటే ఎక్కువ మనుషులు లేరు. పదిగంటలైనా యాభై మంది మించలేదు. పన్నెండు అయ్యింది. ఆ ఉన్నవాళ్ళలో కొంతమంది ఇప్పుడే వస్తామని వెళ్ళారు. క్రిష్ణ ప్రయత్నంతో అతికష్టం మీద సాయంకాలం నాలుగు గంటలకి ఓ వందమంది పోగయ్యారు. ఇక క్రిష్ణే మరణించిన ఎమ్.ఎల్.ఏ. రాజకీయ వారసుడు, శిష్యుడు అని చావులోనూ

పొగిడారు. ఎమ్.ఎల్.ఏ. శవయాత్ర అతి సాధారణంగా ముగిసింది. ప్రస్తుత అభ్యర్థి రాజధానికి పని ఉందని చెప్పి వెళ్ళాడు. ఇటు మనుషులు రాక, తెప్పించిన సామాను చెల్లుబడి కాక క్రిష్ణ పరిస్థితి అయోమయంగా మారింది. ఆ రాత్రి ఎలాగో అతికష్టం మీద నిద్రపోయాడు. ఇన్ని రోజులు పడ్డ అలసట వల్ల కాబోలు.

** ** **

ఏడింటికే ఎండాకాలం సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. "క్రిష్టా లే! లే! కొట్టు తియ్యాలి. అంటూ తట్టి లేపుతున్న తల్లి మాటలకి క్రిష్ణ కళ్ళు తెరిచాడు.

"టైం ఎంతైందేంటి?" అన్నాడు మత్తుగా.

"ఏడు గంటలు అయింది. కాని..."

"ఏడేనా? ...మరో గంట పడుకోనీ. ఇవాళ లేటుగా తీస్తా కొట్టు" అని దుప్పటి ముసుగు పెట్టుకొన్నాడు.

"లే... లే..." అని తల్లి ముసుగు లాగేస్తూ కొట్టుకాడ మనుషులు నీళ్ళ పేకట్ల కోసం చూస్తున్నారు లే!

"ఇంత ఉదయాన్న......."

"అవును. ఏమో మరి కొట్టు తలుపు కొడుతున్నారు అరగంట నుండి". క్రిష్ణ లేచి, మొహం కడుక్కొని "అమ్మా! టీ ఇవ్వవే" అని చెప్పి ఇంటి ముందు బాగంలో ఉన్న కొట్టు వైపు వెళ్ళాడు. అక్కడ అప్పటికే 20-30 మంది మనుషులు నిలబడి ఉన్నారు. వాళ్ళెవరూ రోజూ వచ్చే వాళ్ళు కారు. అయినా ఇంత ఉదయం ఎందుకు వచ్చారో అని అనుకొన్నాడు. అదే వాళ్ళని అడిగాడు.

"మా మేష్టారుగారు సనిపోనారండీ..." అన్నాడు ఒక పల్లెటూరి నాయుడు. తన ఇంట్లోని మనిషి చనిపోయినంత దీనమైన గొంతుతో.

"ఏ మేష్టారు..." క్రిష్ణ తాళం తీస్తూ అడిగాడు.

"అదే మన ఖబడ్దార్ మాష్టారు" అన్నాడు అపుడే అక్కడకు చేరిన క్రిష్ణ కొట్లో పనిచేసే కుర్రాడు.

తాళం తీసి తలుపులా అమర్చిన ఒక్కొక్క చెక్క తీసి పక్కన పెడుతున్న క్రిష్ణకు ఎపుడో తన కొట్టు ముందు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. చెయ్యి జారి చేతిలో చెక్క కాలు మీద పడింది. కాలు జివ్వుమని లాగింది. అయిదు రోడ్ల జంక్షన్లో ఒక రోడ్డు చివర ఖబడ్దార్ మాష్టారు ఇల్లుంది. అటు వైపు తిరిగి చూసాడు. ఆ వీధిలో చాలామంది మనుషులు గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు.

కొట్టు, బేరాలు కొట్లో పనిచేసే కుర్రాడికి అప్ప చెప్పి క్రిష్ణ ఖబడ్దార్ మాష్టారింటి వైపు దారి తీశాడు. రోడ్డు నిండా జనం. ఒకరితో ఒకరు ఏవేవో చెప్పుకొంటున్నారు.

**మధ్యాహ్నానికి క్రిష్ణ కొట్లోనే ఓ వెయ్యి నీళ్ళ పేకట్లు ఉచితంగా అందించారు. మనుషులు ప్రవాహంలా వస్తున్నారు, పోతున్నారు. సాయంత్రం 5 గంటలయ్యేసరికి ఓ వెయ్యి మంది పైబడ్డ జనంతో ఖబడ్దార్ మాష్టారి అంతిమ యాత్ర ఘనంగా జరిగింది.**

"మా కుర్రాడు అయిదరాబాదులో ఈరోజు ఉద్యోగంలో ఉన్నాడంటే ఈ మేష్టారి దయే బాబ్బు" అని ఓ పల్లెటూరి ఆసామి.

"నా పెనిమిటి పోతే నా మడిసెక్క నాకు మిగిలేలా చేసిందీ బాబే" అని ఓ రైతు భార్య. "నాకీ వయసులో ఒక పూటైనా ముద్ద ఉందంటే ఈ బాబు సలవే" రోడ్డు మధ్యలో కూర్చొన్న ఓ వృద్ధుడు.

"మా ఊరు బాగు పడిందంటే ఈయన మా స్కూలు హెడ్ మాష్టార్‌గా ఉన్నందువల్లే" ఓ గ్రామ పెద్ద.

"పది మంది పది రకాలుగా మంచి మాటలు చెప్పుకుంటున్నారు".

క్రిష్ణ రోడ్డు మీద ఉన్న మనుషులను తప్పించుకొంటూ వారి మధ్య నుండి వెళుతుంటే ఇటువంటి మాటలు చాలానే వినిపించాయి. ఎంతో మంది కళ్ళు తుడుచుకుంటుంటే చూసాడు. యాంత్రికంగా ఖబడ్దార్ మాష్టారింటి వైపు వెళ్ళాడు. ఆయన శవాన్ని ఇంటిముందు పాడె మీద ఏర్పాటు చేశారు. రోడ్డుకు అటు వైపు మరింత మంది జనం ఉన్నారు. చిన్న, పెద్ద, ఆడ, మొగ, ముసలివారితో సహా అన్ని వయసులవాళ్ళు, చక్కని బట్టలు కట్టుకున్నవాళ్ళు, ఒంటిమీద సరియైన బట్టలు లేనివాళ్ళు, చుట్టుపక్కల పల్లెల నుండి ఆదరాబాదరగా వచ్చినవాళ్ళు, ఆయన్ని ఒక్కసారి చూడాలని ఆత్రంగా ఉన్నవాళ్ళు, నలభై ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో ఆయన తిరిగిన ఎన్నో ఊళ్ళలోని ప్రజలు, ఆయన సహాయం అందుకొన్న సామాన్యులు, ఏళ్ళ తరబడి ఆయన మంచితనాన్ని గుర్తుంచుకొని ఇవాళ కడసారి చూపు కోసం వచ్చినవాళ్ళతో ఆ అయిదు రోడ్ల జంక్షన్ నిండిపోయింది. అక్కడొక శోక ప్రవాహం కనిపించింది క్రిష్ణకి.

దూరం నుండి వచ్చినవాళ్ళు దాహానికి క్రిష్ణ కిల్లీకొట్టులో నీళ్ళ పేకట్లు కొంటున్నారు. క్రిష్ట తిరిగి వచ్చేటప్పటికి కొట్లో పని చేసే కుర్రాడు ఓ వంద పేకట్లు అమ్మానని చెప్పాడు. క్రిష్ణ మాట్లాడకుండానే చేత్తో పేకట్లు అమ్మొద్దని చెప్పాడు.

"అదేంటన్నా బేరం జోరుగా సాగుతున్నది. నిన్న తెప్పించినవి ఏవీ అమ్మలేకపోయాం. ఇవాళ అన్నీ ఒక్క గంటలో అమ్మెయ్యచ్చు..." అంటున్నాడు.

"అమ్మొద్దు... అడిగినవాళ్ళందరికి ఫ్రీగా తలా ఒక నీళ్ళ పేకెట్టు ఇయ్యి" అని చెప్పి ప్రక్కన ఉన్న స్కూటల్ తీసి మరిన్ని పేకట్లు ఆర్డరు పెట్టి వస్తాను అన్నాడు స్కూటర్ స్టార్టు చేస్తూ.

మధ్యాహ్నానికి క్రిష్ణ కొట్లోనే ఓ వెయ్యి నీళ్ళ పేకట్లు ఉచితంగా అందించారు. మనుషులు ప్రవాహంలా వస్తున్నారు, పోతున్నారు. సాయంత్రం 5 గంటలయ్యేసరికి ఓ వెయ్యి మంది పైబడ్డ జనంతో ఖబడ్దార్ మాష్టారి అంతిమయాత్ర ఘనంగా జరిగింది. ఆ వందలాది మంది సహాయం అందించడానికి ముందుకి వచ్చారు.

** ** **

మర్నాటి ఉదయం అన్ని పేపర్లలో 'ప్రజల మాష్టారు అస్తమయం, లోటు పూడ్చలేని ఉపాధ్యాయుని మృతి' అని పెద్ద పెద్ద అక్షరాలతో ఖబడ్దార్ మేష్టారి జీవిత వివరాలు అనేకం వెలువడ్డాయి. ఆయన బతికున్నప్పుడు చేసిన గుప్తదానం విశేషాలు, ప్రజల అభిప్రాయాలతో వివరంగా ఓ పేజి వ్యాసం జిల్లా సెంటర్ స్ప్రెడ్‌లో వచ్చింది. ఈ పల్లెల్లో పేద ప్రజలని ఆదుకునే దయామయుడిని కోల్పోయిందనే వార్త మెయిన్ పేపర్లో రాశారు. ఈ చుట్టు ప్రక్కల పల్లె ప్రజలని విద్య వైపు ప్రోత్సహించాడని, ఆర్థిక సహాయం చేస్తూ ఇతరులతో చేయిస్తూ వందలాది విద్యార్థుల్ని ప్రోత్సహించాడనీ, ఎన్నో కుటుంబాలని నిలబెట్టే ఆ వ్యక్తి మరిక లేడు అని పత్రికలన్నీ పొగిడాయి. అదే పేజీలో ఆ ఊరి ఎమ్.ఎల్.ఏ. పోయాడనే వార్త నిన్న చాలా చిన్నగా వెలువడింది. క్రిష్ణ ఆ రెండింటిని చదివాడు. చదివిన తరువాత ఏదో ఆలోచనలో పడిపోయాడు. పది గంటలయ్యింది. ఐదు రోడ్ల జంక్షన్ ట్రాఫిక్, మనుషులతో హడావిడిగా మారిపోయింది. ప్రస్తుతం టికెట్టు వచ్చి ఎమ్.ఎల్.ఏ.గా పోటీ చేస్తున్న ఆయన అక్కడకు వచ్చారు. కృష్ణ లేచి నిలబడి కిల్లీకొట్టు లోంచి బయటకు వచ్చాడు.

"క్రిష్టా! ఎల్లుండి సాయంత్రం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంది నువ్వు, మీ వాళ్ళు సమయానికి వచ్చేయండి. మినిష్టర్‌గారు కూడా వస్తారు...." అంటున్న ఆయన్ని చూసి- "అయ్యా! నమస్తే. నేను పార్టీలో చేరడం లేదండి. నన్ను వదిలిపెట్టండి. మిగిలినవాళ్ళు వస్తే వాళ్ళని చేర్చుకోండి" అన్నాడు మెల్లగా వినయంతో.

"అదేంటి క్రిష్టా! నువ్వు మా తమ్ముడి కుడి భుజానివి. నీకు పార్టీలో మంచి భవిష్యత్ ఉంది. ఎందుకలా ఉన్నావు. పార్టీలో చేరడానికి ఏం కావాలో చెప్పు" బుజ్జగించబోయాడు క్రిష్ణని. వచ్చి కారులో తన పక్కన కూర్చోమని సైగ చేశాడు ఎం.ఎల్.ఏ.

"నేను ప్రజలకు సేవ చేద్దాం అనుకొంటున్నానండి" అన్నాడు మెల్లిగా.

"మరి పార్టీలో చేరకుండా ప్రజలకు సేవ ఎలా చేస్తావ్?" నవ్వుతూ కొంటెగా అన్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం. ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు క్రిష్ణ. కాసేపాగి చెప్పక తప్పదు కదా అనుకొని "ఖబడ్దార్ మాష్టారి శిష్యుడిగా!" అన్నాడు క్రిష్ణ దృఢంగా. అప్పటికే గుమిగూడిన క్రిష్ణ అనుయాయులు అది విని ఉత్సాహంతో చప్పట్లు కొట్టసాగారు.

ఒక మాష్టారు తన ఆచరణతో రాజకీయ నాయకులకి చెక్ పెట్టగలడు. మంచి మేష్టారెప్పుడూ ప్రజలవైపుంటాడు. విద్యాసంస్థలో పాఠాలు చెప్పడమే కాదు, తన చదువుని ప్రజలకు వినియోగించడమే విజ్ఞత. అంతటి మంచి మేష్టారు జీవితం క్రిష్ణని బాగా ఆలోచింపచేసింది. నిరక్షరాస్యుడైన క్రిష్ణ మాష్టారి మరణం తరువాత ఆయనకి మొదటి శిష్యుడయ్యాడు. ఒకసారి మాష్టారి రూపాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

క్రిష్ణలో ఒక్కసారి చైతన్యం నిండింది.

*(శ్రీ అనపర్తి సుబ్బారావు మాష్టారిని తలుచుకుంటూ)*